
# సాక్షి జోగుళాంబ గద్వాల

మంగళవారం । 24 । డిసెంబర్ । 2024






**గాడి'తప్పు'తున్నారు..**
కొందరు మైనర్లు ర్యాష్ డ్రైవింగ్‌తో దూసుకెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.
వివరాలు 8లో ▶



**క్రీడాకారులకు వరం**
జిల్లాలో నూతన స్టేడియం నిర్మాణాలు పూర్తయ్యి అందుబాటులోకి వస్తున్నాయి.
వివరాలు 10లో ▶

గరిష్టం/కనిష్టం
32.2/18.1

**వాతావరణం**
ఉదయం మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

## న్యూస్‌రీల్

### విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



**కేటీదొడ్డి:** పోలీసులు విధి నిర్వహణపై మరింత అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సత్యనారాయణ సూచించారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్ డీఎస్పీ తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల దర్యాప్తు, పురోగతిపై ఆరా తీశారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిదిలోని నేరాల నియంత్రణ తగిన చర్యలు తీసుకోవాలని ఆయా కేసులలో పట్టుబడిన వాహనాలను కోర్టు అనుమతితో రిలీజ్ చేయాలని ఎస్‌ఐ శ్రీనివాసులకు సూచించారు. కొత్త వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు అంకితభావంతో పని చేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావలని సూచించారు. సరిహద్దులో పీడీఎస్, ఇసుక, ఇతర అక్రమ రవాణపై నిఘా ఉంచి పట్టుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

### క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

**అయిజ:** క్రీడాకారులు ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని డీవైఎస్ బీఎస్ ఆనంద్ అన్నారు. మండల కేంద్రంలోని బ్రైట్ స్టార్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ బాలుర విభాగం ఖోఖో క్రీడాకారుల క్యాంపును సోమవారం ఆయన సందర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచిపేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్తేర్, పీడీలు బషీర్, నరసింహ, రాజు, రఘు, పీఈటీలు పాల్గొన్నారు.

### విద్యార్థులు సమాజసేవ చేయాలి

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** ఎన్‌ఎస్‌ఎస్‌లో పాల్గొనే విద్యార్థులు సమాజసేవ చేయాల్సిన అవసరం ఉందని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు శీతాకాల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని ఆలీపూర్, బండమీదిపల్లి ప్రాంతాల్లో యూనిట్-9 విద్యార్థులు వారం రోజుల పాటు నిర్వహించారు. సోమవారం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉండే అన్ని రుగ్మతలను రూపుమాపేందుకు ఎన్‌ఎస్‌ఎస్ ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని, గ్రామాల్లో ప్రజలను మద్యపాన నిషేధం, బాల్యవివాహాలు, ఆరోగ్యంపై చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. పీయూలో ఉండే విద్యార్థులు హాస్టల్స్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దాని ద్వారా ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని సూచించారు.

# బోనస్.. బొక్కేసేందుకే..

## పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం అక్రమంగా తరలింపు



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రాశులు (ఫైల్)

- చెక్‌పోస్టుల వద్ద నిఘా కరువు
- ఇప్పటికే మిల్లర్లకు ధాన్యం కేటాయింపులపై ఆరోపణలు
- తాజాగా బోనస్ కొట్టేసేలా కొందరు మిల్లర్ల కుట్రలు
- ఆంధ్రా, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున సన్నాలు..

**గద్వాల:** రైతులు ఆరుగాలం శ్రమించి పంట పండించగా.. దాని ఫలాలను మాత్రం కొందరు అక్రమార్కులు పొందుతూ.. సొమ్ము చేసుకుంటున్నారు. గడిచిన కొంతకాలంగా జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తే వాస్తవం బోధపడుతుంది. ఇప్పటికే జిల్లాలోని పలు మిల్లర్లు ఇచ్చిన ధాన్యానికి సీఎమ్మార్ బియ్యం ఇవ్వకుండా పక్కదారి పట్టిస్తుండగా.. మరికొందరు ఫైన్లు వేసి కేసులు పెట్టిన తరువాత తీరిగ్గా చెల్లిస్తున్న వైనం దర్శనమిస్తుంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు క్వింటాల్‌కు అదనంగా రూ.500 చొప్పున బోనస్ ప్రకటించిన నేపథ్యంలో బోనస్‌ను కొట్టేసెందుకు అక్రమార్కులు పెద్ద స్కెచ్ వేశారు. ఇందుకోసం పక్క రాష్ట్రాలైన ఆంధ్రా, కర్నాటక సరిహద్దుల నుంచి పెద్ద ఎత్తున ధాన్యం అక్రమంగా దందా కొనసాగిస్తున్నారు

### అక్రమార్కుల భారీ స్కెచ్



ఏపీ నుంచి ధాన్యంతో వచ్చిన వాహనాన్ని చెక్‌పోస్టు వద్ద నిలిపిన పోలీసులు (ఫైల్)

సన్నాలకు పక్కరాష్ట్రం కర్నాటకలో క్వింటాల్‌కు రూ.గరిష్టంగా రూ.2400వరకు ధర పలికింది. దాదాపు అన్ని కేంద్రాలలో ధాన్యం రాశులు నిండుగా ఉన్నాయి. ఇదే అదనుగా భావించిన కొందరు మిల్లర్లు బోనస్‌ను కొట్టేసేందుకు భారీ స్కెచ్ వేశారు. పక్కరాష్ట్రాల నుంచి ధాన్యాన్ని మనప్రాంతానికి తరలించి రైతుల పేరిట బోగస్ పత్రాలు సృష్టించి బోనస్‌ను కాజేస్తున్నారు. ఇందులో కొంతమంది కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సివిల్‌సప్‌లైశాఖలో అవినీతికి అలవాటు పడిన అధికారులు, సిబ్బంది మిల్లర్లకు సహకారం అందిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం బోనస్ రూపంలో చెల్లించిన రూ.10కోట్లలో సుమారు 15–20శాతం మేర అంటే రూ.2కోట్ల వరకు బొక్కేసినట్లు బలమైన ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

### కఠిన చర్యలు



ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. ప్రధానంగా పక్కరాష్ట్రాల నుంచి ధాన్యం అక్రమంగా రాకుండా ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24గంటల పాటు నిఘా ఉంచుతున్నాం. గురువారం ఆంధ్రా నుంచి 20లారీలలో ధాన్యం వస్తుందనే సమాచారంతో వాటిని క్షుణ్ణంగా పరిశీలించాం. సరైన ధ్రువపత్రాలు ఉండడంతో వాటిని వదిలిపెట్టాం. ప్రభుత్వం ఇచ్చే బోనస్‌ను ఎవరైన పక్కదారి పట్టించేందుకు యత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్

### 71 కొనుగోలు కేంద్రాలు..

**జిల్లా వ్యాప్తంగా 90వేల ఎకరాల్లో సాగుచేశారు. గతంలో కంటే కూడా ఎకరాకు 25క్వింటాళ్ల** చొప్పున 2.25లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు క్వింటాల్‌కు రూ.500బోనస్ ప్రకటించింది. ఈనేపథ్యంలో గతంలో కంటే కూడా ఈ ఏడాది వానాకాలంలో సుమారు 8వేల ఎకరాల్లో అదనంగా సాగుచేశారు. ఇందులో 15–20వేల ఎకరాల్లో బావులు, బోర్లు, చెరువుల కింద సాగుచేశారు. ఇలా సాగుచేసిన పంట ముందస్తుగానే అంటే అక్టోబర్, నవంబర్ నాటికే చేతికి వస్తుండడంతో రైతులు బహిరంగ మార్కెట్‌లోనే విక్రయాలు జరుపుతారు. అదేవిధంగా పక్కరాష్ట్రాల్లో సైతం సన్నాలకు బహిరంగ మార్కెట్‌లో క్వింటాకు గరిష్టంగా రూ.2400వరకు పలుకుతుండడం, పైగా చేతికొచ్చిన పంట సమయంలో జిల్లాలో ఇంకా కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియ మొదలుకాకపోవడంతో రైతులు అక్కడే విక్రయాలు జరిపారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు సుమారు లక్ష మెట్రిక్ టన్నుల వరకు రైతుల నుంచి ధాన్యం రావొచ్చని అంచనా రూపొందించారు. ఈమేరకు 71కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 3,938 రైతుల నుంచి 29,986మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇలా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి 2708మంది రైతులకు రూ.57.19కోట్లను నేరుగా రైతుల ఖాతాలోకి జమచేసింది. ఇందులో వడ్లకు సంబంధించిన చెల్లింపులు రూ.47.05కోట్లు కాగా, ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రూ.500 సంబంధించిన చెల్లింపులు రూ.10.14కోట్లు చెల్లించారు. ఇంకా 1230మంది రైతులకు సంబంధించిన డబ్బులను చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

### సరిహద్దులో కొరవడిన నిఘా

గద్వాల జిల్లా ఆంధ్రా, కర్నాటక రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతంగా ఉండడంతో అక్రమంగా వచ్చే ధాన్యాన్ని అరికట్టేందుకు అధికారులు జిల్లా వ్యాప్తంగా ఏడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అయితే పగలు వేళలో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు జరుగుతున్నప్పటికీ, రాత్రివేళలో మాత్రం అధికారులు నిఘా వేయడంలో విఫలమతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడే విధులు నిర్వర్తించే కొందరు అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారనే ప్రచారం వినిపిస్తుంది. ఇప్పటికైనా అధికారులు గట్టినిఘా వేసి అక్రమాలకు చెక్ పెట్టాలి.

# క్రైస్తవుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**గద్వాలటౌన్ :** క్రైస్తవుల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రైస్తవుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. కులాల, మతాలకు అతీతంగా పండుగలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలందరినీ ఒకే తాటిపైకి తీసుకొచ్చే గొప్ప పండగ క్రిస్మస్ అన్నారు. శాంతితోనే మానవజాతి సుఖ సంతోషాలతో వర్ధిల్లుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు, కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, ప్రతాప్‌గౌడ్, రాజశేఖర్, కౌన్సిలర్ మురళి, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



క్రైస్తవులకు కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరగా పూర్తిచేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల:** పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వేను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ హాల్‌లో ఇందరమ్మ ఇళ్ల పథకం మొబైల్ యాప్ సర్వే పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చేందుకు మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వేకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సూపర్‌వైజర్లు, సర్వేయర్లు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పనిచేయాలన్నారు. వారి పనితీరును ఎప్పటికప్పుడు ఎంపీడీఓలు పర్యవేక్షించాలన్నారు. సిబ్బంది కొరత ఉంటే, ఇతర సిబ్బందిని సర్వే కోసం నియమించుకోవాలని సూచించారు. పీఎం ఆవాస్ యాప్‌లో సర్వేయర్లు అందరూ కేవలం ఆన్‌లైన్ అథెంటికేషన్ మాత్రమే చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిర్ణిత గడువులోగా పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషినల్ కలెక్టర్లు లక్ష్మినారాయణ, నర్సింగరావు, జడ్పీసీఈఓ కాంతమ్మ, డీపీఓ శ్యాం సుందర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఫిర్యాదులపై సత్వరం స్పందించండి

**గద్వాలటౌన్ :** ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు తక్షణం స్పందించాలని, లేదంటే చర్యలు తప్పవని కలెక్టర్ సంతోష్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఆసరా పెన్షన్లు, భూసంబంధిత, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, ఉపాధి, విద్యుత్తు తదితర సమస్యలపై 45 వినతులు వచ్చాయి. ఆయా జిల్లా శాఖల అధికారులు సంబంధిత మండల అధికారులతో చర్చించి వారి పరిధిలోని దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మినారాయణ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా..



ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

**గద్వాల:** విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల డిమాండ్ల సాధ్యాసాధ్యాలపై మరోసారి సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తెలిపారు. గత 14 రోజులుగా డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు సోమవారం సంపత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు న్యాయం చేయాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని వారు కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల ఆవేదనను సీఎం అర్థం చేసుకున్నారని, ఉద్యోగుల డిమాండ్లు సీఎం దృష్టిలో ఉన్నాయన్నారు.

**కొనసాగుతున్న నిరసనలు..**

డిమాండ్ల సాధన కోసం ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు వివిధ సంఘాల నాయకులు వేరువేరుగా సంపూర్ణ మద్దతును ప్రకటించారు. 14వ రోజు సోమవారం సైతం కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్‌ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు చేతబట్టి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఉద్యోగులను ద్దేశించి మాట్లాడారు. 20 ఏళ్లుగా పనిచేస్తూ గురుకులాలతో సమానంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నా శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాల, అప్పటి వరకు కనీస వేతన స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్, ప్రణీత, ఖాజా, సమి, శ్రీనివాసులు, శేషన్న, రామంజనేయులు, ఎస్ఓలు ఆసియాబేగం, గోపిలత, శ్రీదేవి పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలి



అలంపూర్ కోర్టులో నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జడ్జి మిథున్ తేజ

**అలంపూర్:** సమాజంలో ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మిథున్ తేజ అన్నారు. అలంపూర్‌లోని జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపును సోమవారం నిర్వహించారు. కర్నూల్ మెడికవర్ హాస్పిటల్ వైద్యులు న్యాయవాదులకు, కోర్ట్ సిబ్బందికి, కక్షిదారులకు ఉచితంగా ఈసీజీ, షుగర్, బీపీ వంటి పరీక్షలు నిర్వహించారు. జడ్జి వైద్య శిబిరాన్ని సందర్శించి ఏ విధమైన, ఎన్ని రకాల పరీక్షలు చేస్తున్నారని అడిగి తెలుసుకొన్నారు. మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు ఇమ్రాన్, కొండారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్, ఏజీపీ మధు, న్యాయవాదులు రాజేశ్వరి, నారయణ రెడ్డి, తిమ్మారెడ్డి, నాగరాజు యాదవ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ఆశాలకు రూ.18వేల వేతనం ఇవ్వాలి



గద్వాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

**గద్వాలటౌన్:** రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా మార్చడం కోసం క్షేత్రస్థాయిలో విస్తృత సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని.. లేదంటే ప్రభుత్వంపై సమరం సాగిస్తామని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి హెచ్చరించారు. సమస్యల పరిష్కరం కోరతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బస్సు జాత సోమవారం గద్వాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పాతబస్టాండు చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాలలో ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలుగా నిర్ణయించి అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో తమ పోరాటం ఆపబోమని తేల్చిచెప్పారు. వీటితో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఆశా వర్కర్ల సంఘటిత పోరాటాల ఫలితంగానే రూ.200 నుంచి రూ.9500 వరకు వేతనాలు పెరిగాయన్నారు. వర్కర్లపై రోజు రోజుకు పని భారం పెరుగుతుందని. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకుంటే దీర్ఘకాలిక ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకురాలు పద్మమ్మ, సునీత, సీఐటీయూ నాయకులు వీవీ నర్సింహా, ఉప్పేర్ నర్సింహా, గట్టన్న, కాంతమ్మ, లక్ష్మి, మాధవి, చెన్నమ్మ, సరస్వతి, యశోద తదితరులు పాల్గొన్నారు.

# నేడు నిరసన ర్యాలీ

**గద్వాల క్రైం:** రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని.. క్షమాపణతో పాటు పదవికి రాజీనామా చేయాల్సిందిగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సాక్షత్ పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాతకు జరిగిన అవమానాన్ని దేశ ప్రజలందరు గమనించారని, ప్రజాస్వామ్యంపై దాడి చేసే ప్రయత్నం చేసిన కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం 29 రాష్ట్రాలల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహిస్తుందన్నారు. నేడు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్ వరకు ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డితో పాటు అన్ని మండలల అధ్యక్షులు, పార్టీ కార్యాకార్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. దొడ్డన్న, శంకర్,ఇసాక్, నల్లరెడ్డి, శ్రీనివాస్‌గౌడు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# మాటు వేసి.. దోచేసి

### దారి దోపిడీలో ఆరితేరిన మహారాష్ట్ర ట్రైబల్ గ్రూప్

- ఇటీవల జాతీయ రహదారి-44లో పెబ్బేరు వద్ద ఘటన
- భయంకరమైన రీతిలో దోచుకోవడమే పార్థీగ్యాంగ్ స్పెషాలిటీ
- రెండురోజుల్లోనే ముఠాను పట్టుకున్న పోలీసులు
- రాత్రివేళ ప్రయాణంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



పెబ్బేరు సమీపంలో జాతీయ రహదారిపై దారిదోపిడీకి గురైన వాహనం (ఫైల్)




**సాక్షి, నాగర్‌కర్నూల్:** దేశవ్యాప్తంగా చోరీలు, దారి దోపిడీలకు పేరుమోసిన ముఠాలు తెలంగాణలోనూ సంచరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారి-44పై వనపర్తి జిల్లా పెబ్బేరు వద్ద ఈ నెల 18న చోటుచేసుకున్న దారి దోపిడీ ఘటన కలకలం సృష్టించింది. రహదారి పక్కనున్న ట్రక్ బే ప్రాంతంలో కొద్దిపాటి విశ్రాంతి కోసం వాహనాన్ని ఆపిన యాత్రికులపై మహారాష్ట్రకు చెందిన పార్థి గ్యాంగ్ మెరుపువేగంతో దాడిచేసి దోచుకెళ్లడం సంచలనం సృష్టించింది. హైవేల వెంట సుదీర్ఘకాలం పాటు మాటు వేసి.. అదను దొరకగానే భయంకరమైన రీతిలో దాడి చేస్తూ.. దారిదోపిడీలకు పాల్పడటం ఈ గ్యాంగ్ ప్రత్యేకతగా పోలీసులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పరిశ్రమలు, రైస్‌మిల్లులు, వ్యవసాయ పనుల కోసం వేలాది సంఖ్యలో ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికులు వచ్చి ఇక్కడే ఉపాధి పొందుతున్నారు. ఈ పంథాలోనే పార్థి లాంటి దొంగల ముఠాలు సైతం వచ్చి వారిలో కలిసిపోతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ రహదారులు, రోడ్ల వెంట రాత్రివేళ ప్రయాణించే వాహనదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎక్కడబడితే అక్కడ వాహనాలను ఆపడం సురక్షితం కాదని పోలీసులు సూచిస్తున్నారు.

**కత్తులు, బండరాళ్లతో దాడి..**

హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారి-44పై పెబ్బేరు సమీపంలో ఈ నెల 18న తెల్లవారుజామున చోటుచేసుకున్న దారిదోపిడి ఘటనలో నిందితులను రెండు రోజుల వ్యవధిలోనే పోలీసులు పట్టుకున్నారు. జగిత్యాల జిల్లాకు చెందిన ఓ కుటుంబం కారులో తిరుపతికి వెళ్లి.. తిరుగు ప్రయాణంలో పెబ్బేరు సమీపంలో ఉన్న ట్రక్ బే వద్ద విశ్రాంతి కోసం ఆగారు. అక్కడే చెరుకు ట్రాక్టర్లలో కూలీల రూపంలో మాటు వేసుకున్న ఉన్న పార్థీగ్యాంగ్ వాహనంలో ఉన్న వారిపై కత్తులు, బండరాళ్లతో పాశవికంగా దాడి చేసి దారిదోపిడీకి పాల్పడ్డారు. వారిని తీవ్రంగా గాయపర్చి, మహిళల వద్ద ఉన్న 13 తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. ఇంత జరుగుతున్నా ఘటనా ప్రదేశంలోనే ఉండి తీరిగ్గా చూస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ల ప్రవర్తనపై వచ్చిన అనుమానంతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. ఇది మహారాష్ట్రలోని ఔరంగాబాద్, బీడ్ జిల్లాలకు చెందిన పార్థీగ్యాంగ్ పనిగా పోలీసులు తేల్చారు. మొత్తం ఆరుగురు నిందితుల్లో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

### భద్రత పెంచుతాం..



పార్థీ గ్యాంగ్ హైవేల వెంట మాటువేసి అదను కోసం వేచిచూస్తారు. ఒక్కసారిగా లక్ష్యం వైపు మూకుమ్మడి దాడి చేసి భయోత్పాతం సృష్టిస్తారు. పెబ్బేరు ఘటనలో నిందితులను రెండు రోజుల్లో పట్టుకున్నాం. జాతీయ రహదారుల వెంట సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని వాహనదారులకు భద్రత కల్పిస్తాం. రాత్రివేళ హైవేల వెంట నిర్మానుష్య ప్రాంతాల్లో కాకుండా.. సురక్షితమైన ప్రదేశంలోనే వాహనాలు ఆపాలి.

– సత్యనారాయణ, ఐజీ, మల్టీజోన్-2

### సెల్‌ఫోన్లకు దూరం..

ఇతర రాష్ట్రాలకు చెందిన మేవాడ్, పార్థీ, బదయాన్ ముఠాలు రాష్ట్రంలో సంచరిస్తూ అక్కడక్కడ దోపిడీలకు పాల్పడుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. జాతీయ రహదారుల వెంట నిర్మానుష్య ప్రాంతాల్లో మాటు వేసి ఆగి ఉన్న వాహనదారులపై మెరుపు వేగంతో దాడి చేయడం పార్థీగ్యాంగ్ ప్రత్యేకత. కత్తులు, గొడ్డళ్లు, బండరాళ్లతో వ్యక్తులపై దాడి చేసి రక్తపాతం సృష్టిస్తారు. ఈ అనూహ్య ఘటనతో బాధితులు షాక్‌లో ఉండగానే వారి నుంచి ఆభరణాలు దోచుకుంటారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున ప్రయాణించే వాహనదారులే లక్ష్యంగా దాడులకు పాల్పడుతారు. ఈ గ్యాంగ్ దారిదోపిడిలకు పాల్పడే సమయంలో సెల్‌ఫోన్‌ను అసలే వినియోగించరని తెలుస్తోంది. హైవేల సమీపంలో పరిశ్రమలు, వ్యవసాయ పనుల్లో కూలీలుగా చిన్న చిన్న పనులు చేసుకుంటూనే.. మాటు వేసి ఉంటారు. అనుకున్న లక్ష్యం దొరకగానే మెరుపు వేగంతో దారిదోపిడీలకు పాల్పడుతున్నారు. తాజాగా పట్టుబడిన నిందితులు సైతం పెబ్బేరు సమీపంలోని చెరకు ఫ్యాక్టరీకి పంటను తరలించే కూలీలుగా చెలామణి అవుతూనే.. దోపిడీకి పాల్పడ్డారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో వలస కార్మికులు ఇక్కడి పరిశ్రమలు, రైస్‌మిల్లులు, వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రధానంగా జాతీయ రహదారుల వెంట వీరి అలికిడి ఎక్కువగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇలాంటి దారి దోపిడీ ముఠాలపై నిఘా పెంచాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## క్లుప్తంగా

### ప్రమాదవశాత్తు భీమా కాల్వలో పడి రైతు మృతి


నాగయ్య (ఫైల్)

పాన్‌గల్: ప్రమాదవశాత్తు భీమా కాల్వలో పడి ఓ రైతు మృతిచెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ రోశయ్య తెలిపిన వివరాలు.. మండలంలోని జమ్మాపూర్‌కి చెందిన అన్నె నాగయ్య((52)కు భీమా కాల్వ పక్కన వ్యవసాయ పొలం ఉంది. ఆదివారం పొలానికి వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయలుదేరాడు. పొలం సమీపంలో అన్నె మల్లయ్యకు చెందిన భీమా కాల్వలోని మోటార్ పనిచేయకపోవడంతో నాచు తట్టుకొని ఉందని వారు చెప్పారు. నాగయ్య కాల్వలోని మోటార్‌కు నాచు తొలగిస్తున్న క్రమంలో కాల్వలో ప్రవాహం పెరిగి నీట మునిగి మృతిచెందాడు. సోమవారం ఉదయం బుసిరెడ్డిపల్లి గ్రామ శివారులో భీమా కాల్వలో శవం లభించింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


మృతిచెందిన నాగరాజు

గట్టు : మద్యంమత్తులో ఓవ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం గట్టులో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ కృష్ణుడు తెలిపిన వివరాలు.. గట్టు గ్రామానికి చెందిన బండమీది నాగరాజు(45) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం బహిర్భూమికి ఊరగుట్టకు వెళ్లాడు. అక్కడే పురుగుమందు తాగి పడిపోయాడు. కుటుంబ సభ్యులు అతడి కోసం అనేకచోట్ల వెతికారు. సోమవారం ఉదయం ఊరగుట్టపై పడి ఉన్న నాగరాజును స్థానికులు గుర్తించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహం సమీపంలో పురుగుమందును పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అనంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

### మద్యం మత్తులో కిందపడి ఒకరి మృతి

గద్వాల క్రైం: మద్యం మత్తులో కిందపడి ఒకరు మృతిచెందినట్లు హెడ్ కానిస్టేబుల్ సవరన్న తెలిపారు. గద్వాల మండలంలోని గోనుపాడుకి చెందిన కుర్వ ఆంజనేయులు(48) మేస్త్రీ పనులుచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం మద్యం తాగేందుకు గద్వాలకు వచ్చాడు. రాత్రి 11గంటల సమయంలో పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ప్రమాదవశాత్తు మద్యం మత్తులో కిందపడ్డాడు. ఈప్రమాదంలో అతడు మృతిచెందాడు. మృతుడి భార్య వెంకటేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

### విద్యార్థిపై ప్రిన్సిపాల్ ప్రతాపం

- కట్టెతో కొట్టడంతో శరీరంపై వాతలు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్ పదో తరగతి విద్యార్థిపై ప్రతాపం చూపాడు. మూడు రోజులు స్కూల్‌కు రాలేదన్న కారణంతో కట్టెతో విచక్షణారహితంగా కొట్టాడు. దీంతో విద్యార్థి శరీరంపై వాతలు పడ్డాయి. విషయం బయటకు పొక్కకుండా స్కూల్ యాజమాన్యం జాగ్రత్తపడ్డారు. విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సకోసం తీసుకెళ్లారు. విద్యార్థి రెగ్యులర్‌గా స్కూల్‌కు హాజరుకాడని, దీంతో మందలించామని స్కూల్ యాజమాన్యం చెబుతోంది. ఈవిషయంపై ఇన్‌చార్జీ ఎంఈఓ జీవన్ కుమార్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.

### భర్తను గొడ్డలితో నరికి హత్యచేసిన భార్య

- కుటుంబ కలహాలే కారణమంటున్న గ్రామస్తులు


రాములు (ఫైల్)

లింగాల: క్షణికావేశంలో ఓ భార్య తన భర్తను గొడ్డలితో నరికి అతికిరాతకంగా హత్యచేసిన సంఘటన లింగాల మండలంలోని చెన్నంపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మేకల రాముడు, ఎల్లమ్మ భార్యాభర్తలు. 15రోజుల నుంచి ఇంటికి రాక ఎక్కడ తిరుగుతున్నావని భార్య ఎల్లమ్మ భర్తతో ఆదివారం గొడవ పడింది. అనంతరం రాములు(41) రాత్రి పిల్లలతో కలిసి నిద్రిస్తున్నాడు. ఎల్లమ్మ మొదట రోకలిబండతో ఆ తర్వాత గొడ్డలితో నరికి భర్తను హత్యచేసింది. కుటుంబ కలహాలే ఈ హత్యకు కారణమని గ్రామస్తులు చెబుతున్నారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న అచ్చంపేట సీఐ రవీందర్, లింగాల ఎస్‌ఐ నాగరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి మాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# గాడి‘తప్ప’తున్నారు..

చదువులతో కుస్తీ పడాల్సిన వయస్సులో స్టీరింగ్ చేతపట్టి మైనర్లు రెచ్చిపోతున్నారు.. రయ్‌రయ్ అంటూ రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్‌తో దూసుకెళ్తున్నారు.. ఎదురుగా వస్తున్న వాహనదారులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారు.. కట్టడి చేయాల్సిన తల్లిదండ్రులు విఫలమవుతున్నారు. చిరుప్రాయంలో చేస్తున్న తప్పిదాలతో ఆ కుటుంబాలు జీవితాంతం కుమిలిపోవాల్సి దుస్థితి నెలకొంది.



## రోడ్లపై మైనర్ల ర్యాష్ డ్రైవింగ్

- ప్రమాదాల బారిన పడుతున్న వైనం
- కట్టడిలో విఫలమవుతున్న తల్లిదండ్రులు
- ఇటీవలే కారు నడుపుతూ మైనర్ బీభత్సం

గద్వాల క్రైం: మైనర్లు గాడితప్పిపోతున్నారు. వచ్చిరాని డ్రైవింగ్‌తో ప్రమాదాలకు మూలకారకులు అవుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఇటీవలే ఓ మైనర్ యువకుడు కారు నడుపుతూ కాలనీలో బీభత్సం సృష్టించాడు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గద్వాల జిల్లాలోని ధరూర్, అయిజ, మానవపాడు, ఇటిక్యాల, అలంపూర్, శాంతినగర్, రాజోళి, ఉండవెల్లి ప్రాంతాల్లో తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మైనర్లు రోడ్లపైకి వాహనాలు తీసుకువచ్చిన తరుణంలో పోలీసులు జరిమానాలు విధిస్తూ కౌన్సిలింగ్ ఇస్తున్నారు. గడిచిన సంవత్సరంలో 100 మందికి పైగా మైనర్లకు జరిమానాలు విధించారు.


గద్వాలలో ప్రమాదానికి గురైన కారు(ఫైల్)

### చర్యలు తప్పవు



మైనర్లు వాహనాలు నడపరాదు. వారి వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వాహనాల తనిఖీల్లో మైనర్లు ఎక్కువగా పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో జరిమానాలు విధిస్తున్నాం. మరుసటి రోజు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తాం. ఇప్పటివరకు 100కు పైగా జారిమానలు విధించాం. పట్టుబడిన మైనర్లు మళ్లీ పట్టుబడితే కుటుంబసభ్యులపై చర్యలు తప్పవు. తల్లిదండ్రులు వారి పిల్లలను గమనిస్తుండాలి.అందరి సహకారంతో ప్రమాదాలు నివారించొచ్చు.

కె.సత్యనారాయణ, డీఎస్పీ, గద్వాల

■ ఈనెల 20వ తేదీన ఇటిక్యాల మండలానికి చెందిన ఓ మైనర్ యువకుడు, తండ్రి గద్వాలలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీకి కారులో వచ్చారు. తండ్రి ఇంట్లోకి వెళ్లిన క్రమంలో ఆయువకుడు కారును బయటకు తీశాడు. కాలనీలో వేగంగా కారును నడుపుతూ అదుపు చేయలేక బైక్, ఇంటి గేట్‌ను ఢీకొట్టి ఎదురుగా ఉన్న కేబుల్ వైర్ స్తంభాన్ని ఢీకొని కారు నిలిచిపోయింది. 60మీటర్ల దూరంలోనే ఓప్రైవేటు స్కూల్ ఉంది. ప్రమాద సమయంలో విద్యార్థులు ఎవరూ బయట లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈప్రమాదంలో రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఈ సంఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు. దీంతో పోలీసులు సైతం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

■ మే 18వ తేదీన గద్వాలలోని మోమిన్ మహాల్ల కాలనీకి చెందిన ఓ మైనర్ యువకుడు పనినిమిత్తం బైక్‌పై బయటకొచ్చాడు. కూరగాయల మార్కెట్ సమీపంలో ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి కిందపడ్డాడు. అతడికి తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా కేంద్రంలో తరచూ మైనర్ యువకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

■ ఆగస్టు 15న గద్వాలకి చెందిన ముగ్గురు మైనర్లు ధరూర్ మెంట్ రోడ్డుమార్గంలో బైక్‌పై స్పీడ్‌గా వెళ్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రభాతబేరి చేపట్టారు. బైక్‌ను విద్యార్థుల వైపు తీసుకెళ్లారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పడంతో ముగ్గురు మైనర్ యువకులు తీవ్రంగా గాయపడ్డారు. విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

**ర్యాష్ డ్రైవింగ్** జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మైనర్లు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్లపైకి దూసుకువస్తున్నారు. పట్టణ శివారుల్లో పలువురు బైక్ రైడింగ్‌లపై పందెంలు వేసుకుంటున్నారు. అయితే తల్లిదండ్రులు తమ పిల్లలకు బైక్‌లు నేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇదే అదునుగా భావించి యువత మితిమీరిన వేగంతో రోడ్లపైకి వస్తున్నారు. చిరు ప్రాయంలోనే ప్రమాదాలబారిన పడుతున్నారు. ఘోరమైన రోడ్డు ప్రమాదాల బారినపడి దివ్యాంగులైన యువకులు సైతం ఉన్నారు. పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టిన క్రమంలో సగటున 30–40 మంది మైనర్లే పట్టుబడుతున్నారు. పట్టుబడిన క్రమంలో దళారులు వారిని పోలీసుల నుంచి విడిపిస్తున్నారు.

## త్వరలో ట్రామాకేర్ సెంటర్ పనులు ప్రారంభిస్తాం

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి


108ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట పీహెచ్‌సీ వద్ద త్వరలోనే ట్రామాకేర్ సెంటర్ నిర్మాణం పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జానంపేట పీహెచ్‌సీ వద్ద సోమవారం కొత్తగా ఏర్పాటుచేసిన 108 అంబులెన్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సూచించారు. అనంతరం అడ్డాకుల పీహెచ్‌సీ వద్ద 102 అమ్మఒడి వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 44వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాల్లో గాయపడే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు ట్రామాకేర్ సెంటర్ మంజూరైందన్నారు. మండలాధ్యక్షులు శెట్టిశేఖర్, తోట శ్రీహరి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, జగదీశ్వర్, విజయమోహన్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, బగ్గి కృష్ణయ్య, గోవర్ధన్, హేమవర్ధన్‌రెడ్డి, శరత్‌రెడ్డి, షఫీఅహ్మద్, కృష్ణయ్య, నిరంజన్ ఉన్నారు.

### తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మండలంలోని కుమ్మెర గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. కుమ్మెరకి చెందిన శివకుమార్ నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఈనెల 21న ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.14,500 నగదును చోరీ చేశారు. సోమవారం ఉదయం ఇంటిపక్కల వారు గమనించి శివకుమార్‌కు సమాచారం అందించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## చర్చలు జరపకుండానే సర్వే చేస్తారా..

- ప్రాజెక్టు సర్వే పనులను అడ్డుకున్న రైతులు


సర్వే పనులను అడ్డుకున్న రైతులతో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

బల్మూర్: ఉమామహేశ్వర్ సాగునీటి ప్రాజెక్టు అధికారులు రైతులతో ఎలాంటి చర్చలు జరపకుండానే సర్వే చేస్తారా అంటూ ప్రశ్నించారు. సోమవారం రైతులు ఈసర్వే పనులను అడ్డుకున్నారు. తమ భూమికి తిరిగి భూమి ఇస్తేనే సర్వే చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈవిషయంపై కోర్టుకెళ్లినా కూడా ఎవరు తమతో చర్చలు జరపకుండా సర్వే చేయడం తగదన్నారు. విషయం తెలుసుకున్న అచ్చంపేట సీఐ రవీందర్, ఎస్‌ఐలు రమాదేవి, రమేష్, వెంకట్ రెడ్డి సిబ్బందితో కలిసి సర్వేపనుల వద్దకు చేరుకున్నారు. రైతులు సహదేవ్, జానకిరాములు, తిరుపతయ్య తదితరులతో మాట్లాడారు. రైతులు తమ డిమాండ్లను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సర్వేకు రైతులు అడ్డుతగలడంతో సిబ్బంది తిరిగి వెళ్లి పోయారు.

### ఆగని చిరుతల దాడులు

- భయాందోళనలో పశువుల కాపరులు

మద్దూరు: మండలంలో చిరుతపులుల దాడులు ఆగడం లేదు. నందిపాడుగుట్టలో సోమవారం సాయంత్రం చిరుతల దాడుల్లో రెండు మేకలు మృతిచెందినట్లు గొర్రెల కాపరి తెలిపారు. స్థానికుల కథనం మేరకు.. నందిపాడుగుట్టలో పుట్నాల చంద్రప్పకు చెందిన మేకలను మేపి ఇంటికి తీసుకొస్తున్న సమయంలో గుట్టల మధ్యలో రెండు చిరుతలు మేకల మందపై దాడి చేశాయి. రెండు మేకలు ఈ దాడిలో మృతి చెందాయి. దీంతో ఆ మార్గం గుండా వెళ్లేందుకు పశువుల కాపరులు భయాందోళన చెందుతున్నారు. చిరుతల కోసం ఆదివారం రెండు బోనులు ఏర్పాటుచేసినట్లు అటవీ శాఖాధికారి లక్ష్మణ్ తెలిపారు.

## ఇద్దరు ఉద్యోగుల మధ్య గొడవ.. భార్య ఆత్మహత్యాయత్నం

మహబూబ్‌నగర్ క్రైం: గత కొన్ని రోజులుగా ఇద్దరు పోలీస్ సిబ్బంది మధ్య వ్యక్తిగతంగా ఉన్న గొడవలు కారణంగా ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఒకరు సస్పెండ్ అయ్యాడు. దీంతో సస్పెండ్ అయిన ఉద్యోగి భార్య మనస్తాపంతో శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రి రక్షణ విభాగంలో పనిచేసే సిబ్బందిలో ఒక ఏఎస్‌ఐ ర్యాంక్ ఉద్యోగి, ఒక కానిస్టేబుల్ కొన్ని రోజుల నుంచి గొడవపడుతున్నారు. ఇటీవల ఉన్నతాధికారులకు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో కానిస్టేబుల్ డ్యూటీకి వెళ్లకుండా ఇంట్లో ఉండటంతో అనుమానం వచ్చి ఈ విషయమై సదరు కానిస్టేబుల్ భార్య ఆరా తీసింది. విషయం తెలుసుకుని మనస్తాపంతో ఇంట్లో ఉన్న శానిటైజర్ తాగినట్లు సమాచారం. ప్రస్తుతం ఆమెకు జనరల్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

### రైతుకు చిక్కిన 5 అడుగుల కొర్రమీను



అయిజ: మండలంలోని భూంపురం గ్రామ శివారులోని నెట్టెంపాడు ప్రాజెక్ట్ కాల్వలో సోమవారం రైతు బోయ హనుమంతుకు అరుదైన 5 అడుగుల కొర్రమీను చేప చిక్కింది. దీని బరువు సుమారు 10కేజీలు ఉంటుంది. పంట కాల్వలో కొన్ని రోజుల నుంచి నీటిని నిల్వ చేయడంతో ఈచేప చిక్కిందని రైతు తెలిపారు. ఇంతపెద్ద చేప పంట కాల్వలో చిక్కడం ఇదే మొదటిసారి. అతిపెద్ద కొర్రమీను చేప చిక్కడంపై రైతు హర్షం వ్యక్తం చేశాడు.

## బాలికకు పాముకాటు

- విషరహిత పాములుగా గుర్తించిన స్నేక్ స్కాచర్ సుమన్


పాములను పరిశీలిస్తున్న స్నేక్ క్యాచర్ సుమన్

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లితండాలో ఇంటి ముందు ఉన్న ఆరేళ్ల బాలికను ఆదివారం ఉదయం ఓ పాము కాటేసింది. కాగా బాలిక తల్లిదండ్రులు ఆ పాములను చంపేసి బాలికతో పాటు వాటిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అవి విషపూరిత పాములు కావని ఆందోళన చెందొద్దు అని వైద్యులు ధైర్యం చెప్పి పంపించిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. వివరాలు.. కాంసానిపల్లితండాలో నివసిస్తున్న కాట్రావత్ విజయ, హన్మంతుల కుమార్తె ఆరేళ్ల నిషా. ఆబాలిక ఆదివారం ఉదయం ఇంటి ముందు ఉండి అన్నం తింటుంది. పక్కనే ఉన్న పూరిగుడిసెలో నుంచి రెండు పాములు బయటికొచ్చాయి. అందులో ఒక పాము బాలికను కాటేసింది. దీంతో పాప ఏడ్వడంతో తల్లిదండ్రులు బయటికొచ్చి వెంటనే ఆ పాములను చంపేశారు. వాటిని కవర్‌లో వేసుకొని బాలికను అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బాలికకు వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. బాలిక ఆరోగ్యంగానే ఉండటంతో వైద్యులు స్నేక్ క్యాచర్ సుమన్‌ను పిలిపించి చంపిన పాములను చూపించారు. అతను వాటిని పరిశీలించి విషరహిత నీరు కట్టిపాములుగా గుర్తించాడు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుకభాగంలో సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి(45) మృతదేహం లభ్యమైనట్లు హెడ్ కానిస్టేబుల్ శాంతయ్యగౌడ్ తెలిపారు. స్థానికులు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రి తరలించామన్నారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే పట్టణ పోలీసులను సంప్రదించాలన్నారు.

# ఆర్టీసీ బస్‌ను ఢీకొట్టిన చెరుకు లారీ


ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన చెరుకులోడ్ లారీ

- పరుగులు తీసిన ప్రయాణికులు
- పలువురికి గాయాలు

అమరచింత: బస్‌స్టాప్‌లో బస్సు ఎక్కిన కొద్ది నిమిషాలకే బస్సును చెరుకు లారీ ఢీ కొట్టడంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏం జరుగుతుందోనని బస్సు దిగి పరుగులు తీశారు. ఈ సంఘటనలో పలువురికి రక్త గాయాలు కాగా, స్వల్పగాయాలైన సంఘటన అమరచింత పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెలితే ఆత్మకూర్ నుంచి మరికల్‌కు నారాయణపేట డిపో బస్సు బయలుదేరింది. ఉదయం 11 గంటలకు అమరచింత బస్టాప్‌లో ప్రయాణికులను ఎక్కించుకోగా, మొత్తం 70 మంది ఉన్నారు. పట్టణంలోని రాజీవ్ చౌరస్తా వద్ద నాగల్ కడ్మూర్ నుంచి చెరుకు లోడ్‌తో వస్తున్న లారీ బస్సును ఢీ కొట్టింది. దీంతో ప్రయాణికులు కంగారుగా బస్సు దిగి పరుగెత్తారు. నలుగురికి రక్త గాయాలు కాగా, 10 మందికి స్వల్పగాయాలు అయ్యాయి. అమరచింతకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఇఫ్తేకార్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. ఉంద్యాల గ్రామానికి చెందిన ప్రమీల, వెంకటేష్‌గౌడ్ దంపతులు, ఏసమ్మ, పద్మమ్మ, షకీలా బేగంకు గాయాలు కాగా, వారిని ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

**చెరుకు రవాణాతో ఇబ్బందులు**

కృష్ణవేణి ఫ్యాక్టరీకి చెరుకును తరలిస్తున్న ట్రాక్టర్లు, లారీలు అధిక లోడ్‌తో వెళ్తుండడం, రహదారికి అడ్డంగా వెళ్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కెపాసిటి లేని లారీలు, అనుభవం లేని డ్రైవర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేలలో చెరుకు రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్‌లేని వారిపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

## వేసవి సాగుకు అనుకూలం ‘గోరు చిక్కుడు’

- డా.పిడిగెం సైదయ్య, అసోసియేట్ డీన్, ఉద్యాన కళాశాల, మోజర్ల


గోరు చిక్కుడు సాగు పంట.

**పాడి-పంట**
డాక్టర్ పిడిగం సైదయ్య, అసోసియేట్ డీన్, ఉద్యాన కళాశాల, మోజర్ల



కొత్తకోట రూరల్: గోరుచిక్కుడు వేసవి సాగుకు అనుకూలమైన పంట. పశుగ్రాసంగా, కాయగూరగ, జిగురు ఉత్పత్తి కోసం సాగులో ఉన్న పంట ఇది. గింజలో 18 శాతం ప్రొటీన్, 32శాతం పీచు పదార్థాలు, 33శాతం జిగురు ఉంటుంది. విదేశాలకు ఉత్పత్తి అవుతున్న వాటిలో ‘గోరు చిక్కుడు’ జిగురు ప్రధానమైనది. రాష్ట్రంలోని ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో ఈ పంట సాగుకు అవకాశాలున్నాయి.గోరు చిక్కుడు ఉష్ణమండల పంట. వేడి వాతావరణం అవసరం. ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే పంట పొడవుగా పెరుగుతుంది.

**మధ్యస్త, తేలికపాటి నేలలు**

ఉదజని సూచిక 7–8.5 మధ్య ఉండి మధ్యస్త, తేలికపాటి నుంచి నేలల్లో ఈపంట బాగా పెరుగుతుంది. నేలలో నీరు ఇంకేలా తయారుచేయాలి. ముందుగా వేసవిలో లోతు దుక్కిచేసి, ఆ తర్వాత రెండు, మూడుసార్లు దుక్కి చేయాలి. పప్పుధాన్యపు పంట కాబట్టి భూమిలో నత్రజనిని స్థాపించి భూసారాన్ని పెంచుతుంది.

**విత్తన మోతాదు**

ఎకరాకు 6కిలోల చొప్పున విత్తనం వాడాలి. కిలో గ్రాము విత్తనానికి 4గ్రాముల ట్రైకోడెర్మా లేదా 2 గ్రాముల కార్బండిజంతో శుద్ధిచేయాలి. ఆతర్వాత రసం పీల్చే పురుగుల మందుతో శుద్ధి చేయాలి. సిఫార్సు చేసిన రైజోబియం జీవన ఎరువును కిలో విత్తనాలకు 40 గ్రాముల చొప్పున పట్టించాలి. 200 గ్రాముల రైజోబియం కల్చరు 250 గ్రాముల బెల్లం ద్రావకంతో కలిపి ఒక లీటరు నీటిలో ఉంచి ద్రావణం తయారు చేయాలి. ఆద్రావణాన్ని విత్తనాలపై పొరగా ఏకరీతిగా పట్టించాలి. నీడలో అరగంట పాటు ఆరబెట్టాలి. 24గంటల లోపు ఆరిన విత్తనాలను నేలలో విత్తాలి.

**ఎరువులు..**

హెక్టారుకు 20కిలోల నత్రజని, 40కిలోల భాస్వరం అవసరం. వీటిని విత్తనం నాటేటప్పుడే వేయాలి. విత్తటానికి 15 రోజుల ముందు హెక్టారుకు 2.5టన్నుల బాగా చివికిన పశువుల ఎరువు వేయాలి.

**కలుపు యాజమాన్యం:** గడ్డి జాతి, వెడల్పాటి ఆకు జాతి కలుపు సమస్య వానకాలంలో ఎక్కువ. పంట తొలి 30–35 రోజులలో కలుపు నివారణ చేపట్టాలి. 25, 45 రోజుల్లో రెండుసార్లు చేతితో కలుపు తీయాలి.

**బ్యాక్టీరియా తెగులు:** ఐదు గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్ లేదా 50 గ్రాముల ప్లాంటామైసిన్ 100 గ్రాముల నీటిలో కలిపి 35–40 రోజుల పొలంలో హెక్టారుకు పిచికారీ చేయాలి.

**బూడిద తెగులు**

దీని నివారణకు హెక్టారుకు 20–25 కిలోలు పొడి గంధకం పొడర్ లేదా 2–3 కిలోల తడి గంధకం లేదా లీటరుకు 1.5 మి.లీ డినోక్యాప్ పిచికారీ చేయాలి.

**దిగుబడి:**

వర్షాధార పంటలో హెక్టారుకు 7–8 క్వింటాళ్లు. నీటి వసతిలో హెకార్టుకు 12–15 క్వింటాళ్లు. జిగురు సాగుచేసే రైతులు ముందుగా కొనుగోలు దారులతో ఒప్పందాలు చేసుకోవాలి.

**విత్తనోత్పత్తి:** గోరుచిక్కుడు స్వతహాగా స్వపరాగ సంపర్కపు పంట. రైతులు సొంతంగా విత్తనోత్పత్తి చేయవచ్చు.

### గొలుసుకట్టు స్కీం నిర్వాహకుడిపై కేసు నమోదు

గద్వాల క్రైం: గొలుసుకట్టు స్కీం పేరుతో ఆదివారం పట్టణంలోని బీరోలు చౌరస్తాలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో సమావేశాన్ని నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు. వివరాలు.. గద్వాలకి చెందిన నవీన్‌కుమార్ కొన్ని రోజులుగా ఎల్ఎఫ్ఎల్ ఆర్గనైజేషన్ పేరుతో ఒక వ్యక్తి రూ.12వేలు డిపాజిట్ చేస్తే 45రోజుల్లో రూ.48 వేలు వస్తాయని వివరించే సమావేశం నిర్వహించాడు. ఈ సమావేశానికి దాదాపు 200 మంది సభ్యులు హాజరయ్యారు. ఈ స్కీం నిబంధనలు, అనుమతులు తదితర అంశాలపై విచారణ చేపడుతున్నామన్నారు. సూమోటో కేసుగా స్వీకరించి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

### ఇసుక డంపు సీజ్


మాగనూర్: మండలంలోని వద్వాట్, యామన్‌దొడ్డి గ్రామాల సమీపంలో అక్రమంగా తరలించిన నిల్వ చేసిన సుమారు పదిహేను టిప్పర్ల ఇసుక డంపును సీజ్‌చేసినట్లు ఆర్‌ఐ శ్రీశైలం తెలిపారు. అడవిసత్యరం గ్రామ పెద్దవాగు నుంచి అనుమతుల్లేకుండా ఇసుక తరలించి వద్వాట్, యామన్‌దొడ్డి గ్రామాల సమీపంలో డంప్ చేశారు. సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించగా ఇసుక ఉన్నట్లు గుర్తించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్ ఆదేశాల మేరకు ఇసుక డంప్ సీజ్ చేశారు. ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.


యామన్‌దొడ్డి గ్రామ సమీపంలో సీజ్ చేసిన ఇసుక డంపు

## కరెంట్ కోత.. చార్జీల మోత

**ఏపీలో 6 నెలల్లో రూ.15 వేల కోట్లకుపైగా జనంపై భారం వేసిన కూటమి సర్కార్**

**ఒకపక్క విద్యుత్ బిల్లుల షాక్‌లు.. మరోపక్క కోతలు**



రోజూ 2 నుంచి 3 గంటల పాటు సరఫరా నిలిపివేత

డిమాండ్ మేరకు సరఫరా చేయలేక అనధికారిక కోతలు

కరెంట్ లేక చీకట్లో గాఢాంధకారంలో అల్లాడుతున్న గ్రామాలు

ఎస్సీ, ఎస్టీలకు గత ప్రభుత్వం అందించిన ఉచిత విద్యుత్తుకు ఎగనామం

ఉచిత విద్యుత్తు లబ్ధిదారులకు రూ.వందలు.. వేలల్లో బిల్లులు జారీ చేస్తున్న కూటమి సర్కారు

తమ కష్టాలు చెప్పకుంటే పింఛన్లు, రేషన్ కార్డులు తొలగిస్తారని ప్రజల్లో ఆందోళన

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

# ఈనాడు చెవిలో ఈడీ చెప్పిందా?

**దర్యాప్తు విషయాలు బహిర్గతమయ్యాయా?**

**లేక ఈనాడు తన అజెండాకు అనుగుణంగా కథనాలను నడిపిస్తోందా?**




- రూ.3,000 కోట్ల నికర లాభాలు సాధిస్తున్న అరబిందో రూ.494 కోట్లు సమకూర్చుకోలేదా?
- నిజంగానే బెదిరించి ఉంటే పోర్టులో 100% వాటా తీసుకుంటారుగానీ 41 శాతం వాటా మాత్రమే ఎందుకు తీసుకుంటుంది?

**వ్యూహాత్మక పెట్టుబడిలో భాగంగానే కాకినాడ డీప్‌వాటర్ పోర్టులో వాటాల కొనుగోలు**

**ఆడిటర్లను ఆయా శాఖల అధికారులు ఎంపిక చేస్తారన్న విషయం ఎల్లో మీడియాకు తెలియదా?**

**సాక్షి, అమరావతి:** కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాల విక్రయంపై 'ఈనాడు' తన ఆక్రోశాన్ని మరోసారి వెళ్లగక్కింది. 150 దేశాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తూ ఏటా రూ.3,000 కోట్లకు పైగా లాభాలను ఆర్జిస్తున్న కంపెనీ రూ.494 కోట్లు సమకూర్చుకోవడం కూడా పెద్ద వింత అయినట్లు ఒక విషపూరిత కథనాన్ని వండివార్చింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేస్తున్న దర్యాప్తు అంతా ఈనాడుకు చెవిలో చెబుతున్నట్లుగా "రూ.494 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి?" అంటూ సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్వయం ప్రతిపత్తి కలిగిన ఈడీ లాంటి సంస్థ దర్యాప్తు చేస్తున్న విషయాలే కాకుండా ఎవర్ని, ఎప్పుడు, ఎలా విచారిస్తారు...? వారిని ఏ ప్రశ్నలు అడుగుతారు? అనే వాటిని కథనంలో ప్రచురించడంపై పలు సందేహాలు తలెత్తుతున్నాయి. ఒకవేళ నిజంగానే విషయాలను ఇలా బయటకు చెబుతుంటే ఆ దర్యాప్తు ఎంత పక్షపాతంతో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు! లేదంటే ఈనాడు తన అజెండాకు అనుగుణంగా ఈడీ పేరుతో ఈ కథనాలను వండివార్చి ఉండాలి. ఈ రెండింటిలో ఏది నిజమైనా ఈనాడు ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరి అజెండాకు డప్పు కొడుతుందో ఊహించవచ్చు!!

### అది వ్యూహాత్మక పెట్టుబడి

అరో ఇన్‌ఫ్రా వ్యూహాత్మక పెట్టుబడిలో భాగంగా

**ఏది నిజం?**

కాకినాడ డీప్ వాటర్‌పోర్టులో వాటాలు కొనుగోలు చేసింది. పోర్టులో 41 శాతం వాటాలను కేవీ రావు పూర్తి సమ్మతితోనే 2020లో విక్రయించడంతో పాటు ఆ వాటాల విలువ రూ.494 కోట్లను స్వీకరించారు. కాకినాడ డీప్‌వాటర్ పోర్టు దగ్గరలోనే కాకినాడ సెజ్‌ను రూ.1,700 కోట్లకు కొనుగోలు చేయడంతో పాటు ఆ సెజ్‌లో రూ.2,400 కోట్లతో మరో పోర్టును కూడా అరో ఇన్‌ఫ్రా నిర్మిస్తోంది. ఇదంతా వ్యూహాత్మక వ్యాపార ప్రణాళికలో భాగంగా జరిగింది. సెజ్‌ను ఆనుకుని ఉన్న కాకినాడ డీప్ వాటర్ పోర్టులో కూడా తమకు వాటాలు ఉంటే వ్యూహాత్మకంగా ప్రయోజనకరమని అరబిందో సంస్థ భావించింది. భవిష్యత్‌లో కాకినాడ డీప్ వాటర్ పోర్టులోని తన మెజార్టీ వాటాలను ప్రమోటర్ కేవీ రావు విక్రయించాలని భావిస్తే ముందుగా అరబిందో సంస్థకే అవకాశం ఇవ్వాలి. ఆ నిబంధన (రైట్ టు ఫస్ట్ రెఫ్యూజల్) ఒప్పందంలో ప్రధానాంశం. ఒకవేళ బెదిరించి ఉంటే మొత్తం పోర్టునే స్వాధీనం చేసుకుని ఉంటారు కదా! 41 శాతం వాటా కొనుగోలు తర్వాత కూడా పోర్టు యాజమాన్య హక్కులు కేవీరావు చేతిలోనే ఉన్నాయి కదా. ఆయన్ను నిజంగానే బెదిరించి ఉంటే అప్పుడే రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, స్టాక్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ), నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(ఎన్ఎల్ఎస్ఏ) తదితర సంస్థలకు ఫిర్యాదు చేసేవారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించేవారు. కానీ కేవీ రావు ఈ నాలుగున్నరేళ్లలో ఎవరికీ ఫిర్యాదు చేయలేదు. కేవీ రావుకు అభ్యంతరం ఉంటే వాటాల బదిలీ పూర్తయ్యేలోగా వివిధ దశల్లో ఎప్పుడైనా సరే ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంది. కానీ ఆయన ఏ దశలో కూడా ఫిర్యాదు చేయలేదు. అంటే ఆయన పూర్తి సమ్మతితోనే వాటాలను విక్రయించారన్నది స్పష్టమవుతోంది. నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు ఫిర్యాదు చేశారంటే దీని వెనుక కుట్రను సులభంగా అర్థం చేసుకోవచ్చు.

**తప్పుడు ఫిర్యాదు... వెంటనే కేసు**

అనంతరం అసలు పాత్రధారి తెరపైకి వచ్చారు. ప్రభుత్వ పెద్దలకు సన్నిహితుడైన కాకినాడ డీప్ వాటర్‌పోర్ట్ ప్రమోటర్ కేవీ రావుతో ఈ నెల 2న సీఐడీకి ఫిర్యాదు ఇప్పించారు. 2020లో తనను బెదిరించి కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌లో 41శాతం వాటాను అరబిందో సంస్థకు చెందిన అరో రియాల్టీ సంస్థ కొనుగోలు చేసిందని ఆయన నాలుగేళ్ల తరువాత ఫిర్యాదు చేయడం చంద్రబాబు పక్కా కుట్రను స్పష్టం చేస్తోంది. విచిత్రం ఏమిటంటే... కేవీ రావు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు చేసిన ఈ నెల 2నే సీఐడీ కేసు నమోదు చేసేయడం గమనార్హం

### ఆడిట్ సంస్థను ఎంపిక చేసేది ఆ శాఖ కార్యదర్శి

ప్రభుత్వాలు వివిధ విభాగాల్లో ఆడిటింగ్ నిర్వహించడం సాధారణం. ఏదైనా విభాగంలో ఆడిటింగ్ నిర్వహించాలంటే ఆ శాఖకు చెందిన కార్యదర్శి ఆడిటింగ్ సంస్థను ఎంపిక చేస్తారు. ఇక్కడ కూడా అదే విధంగా పీకేఎఫ్ శ్రీధర్ అండ్ సంతానం ఎల్ఎల్‌పీ అనే ఆడిటింగ్ సంస్థను ఎంపిక చేశారు. ఆ ఆడిటింగ్ సంస్థకు, విజయసాయిరెడ్డికి ఏమిటి సంబంధం? లేని సంబంధాలను అంటగట్టి మసిబూసి మారేడు కాయ చేయాలని, తద్వారా ఎల్లో గ్యాంగ్‌కు ప్రయోజనం కలిగించేందుకు ఈనాడు పడరానిపాట్లు పడుతోంది.



**ప్రభుత్వ పోర్టును కారుచౌకగా కట్టబెట్టింది బాబే**

కాకినాడ డీప్ వాటర్ పోర్టును ప్రైవేటుపరం చేసింది గతంలో చంద్రబాబు ప్రభుత్వమేనన్నది అసలు వాస్తవం. ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఏడీబీ రుణాలతో ఏపీ ప్రభుత్వం కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌ను 1997లో నిర్మించింది. లాభాల్లో ఉన్న ఆ పోర్టును 1999లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబే కారు చౌక ధరకు ప్రైవేటుపరం చేశారు. ఓ మలేషియా కంపెనీని ముందు పెట్టి కాకినాడ డీప్‌వాటర్ పోర్టును కారు చౌకగా కట్టబెట్టేశారు. కానీ తరువాత అసలు విషయం వెలుగు చూసింది. మలేషియా కంపెనీ ముసుగులో చంద్రబాబు సన్నిహితుడు కేవీ రావు ఆ పోర్టును దక్కించుకున్నట్లు బయటపడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదలు పెట్టిన రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులను కూడా చంద్రబాబు తన బినామీలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేస్తుండటం గమనార్హం.

## ప్రైవేట్ ఒప్పందంతో ప్రభుత్వానికి ఏం సంబంధం?

అరబిందో సంస్థ 150 దేశాల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ అంతర్జాతీయంగా విశేష గుర్తింపు పొందింది. ఏటా రూ.72 వేల కోట్ల టర్నోవర్, రూ.3 వేల కోట్ల నికర లాభం నమోదు చేస్తోంది. ఆ వ్యాపార లావాదేవీ పూర్తిగా అరబిందో సంస్థ, కేవీ రావు మధ్య జరిగిన ప్రైవేట్ ఒప్పందం. అందులో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికిగానీ, ఇతరులకుగానీ ఎలాంటి సంబంధం లేదు. కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాల విక్రయం అన్నది పూర్తిగా రెండు ప్రైవేటు సంస్థల మధ్య వ్యవహారం. ఐదేళ్ల తరువాత చంద్రబాబు ప్రభుత్వం ఆ వ్యవహారంలో తల దూర్చడం వెనుక పక్కా కుట్ర ఉందని స్పష్టమవుతోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా ప్రైవేటు ఆస్తుల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ దందా సాగిస్తుండటం విభ్రాంతికరం. రెండు సంస్థల మధ్య ప్రైవేటు వ్యవహారంలో టీడీపీ కూటమి ప్రభుత్వం జోక్యం వెనుక మర్మం ఏమిటి? ప్రభుత్వం మారగానే అంతకుముందు జరిగిన ప్రైవేటు వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటామంటే రాష్ట్రంలోనే కాదు దేశంలో కూడా ఓ దుష్ట సంప్రదాయానికి తెరతీసినట్టు అవుతుంది. పరస్పర అంగీకారంతో ప్రైవేటు ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు సాగుతుంటాయి. ఐదేళ్ల తరువాత సహజంగానే ఆ ఆస్తుల మార్కెట్ విలువ పెరుగుతుంది. మార్కెట్ విలువ పెరిగింది కాబట్టి ఐదేళ్ల క్రితం తనను బెదిరించి ఆస్తిని అమ్మేలా చేశారని ఫిర్యాదు చేస్తామంటే ఎలా..? వాటిలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటే పరిస్థితి ఎంతవరకు వెళుతుంది ?

**అంతా బాబు కుట్ర స్క్రిప్టే...**

కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాలను హస్తగతం చేసుకునేందుకు చంద్రబాబు పన్నాగం పన్నారు. ఈ క్రమంలో పోర్ట్ నుంచి బియ్యం అక్రమ రవాణాను తెరపైకి తెచ్చి జనసేనలోని తన కోవర్ట్, మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కాకినాడ పర్యటనకు పంపారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ గత నెల 29న ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం చేరుకుని కాకినాడలో వాలారు. కాకినాడ యాంకరేజ్ పోర్ట్ వద్దకు చేరుకుని రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారంటూ డ్రోన్ కెమెరాలతో డ్రామా పండించారు. యాంకరేజ్ పోర్ట్‌ను ప్రభుత్వమే నిర్వహిస్తోంది. మరి అక్కడ నుంచి రేషన్ బియ్యం స్మగ్లింగ్ జరిగితే వారు ప్రశ్నించాల్సింది ముఖ్యమంత్రి చంద్రబాబునే కదా!!

## ఆటో బోల్తా.. మహిళ మృతి

**ముగ్గురికి గాయాలు**

**మహబూబ్‌నగర్ క్రైం:** ఆటో అతివేగం వల్ల స్పీడ్ బ్రేకర్ దగ్గర సడెన్‌గా వెనుక టైర్ ఊడిపోవడంతో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న మహిళకు తీవ్ర గాయాలై మృతి చెందింది. మరో ముగ్గురికి గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌ఐ శీనయ్య కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని వీరన్నపేటకు చెందిన శంకరమ్మ(49)తో పాటు సంగీత, అనిత, లక్ష్మమ్మలు కలిసి వీరన్నపేట నుంచి సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని భూలక్ష్మీకాలనీలో శంకరమ్మ కూతురు స్రవంతి ఇంట్లో నిర్వహిస్తున్న అయ్యప్ప పూజకు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో జైలు ఎదుట ఆటో డ్రైవర్ వేగంగా వెళ్లడంతో స్పీడ్ బ్రేకర్ దగ్గర ఆటో టైర్ ఊడిపోయి బోల్తా పడింది. దీంతో శంకరమ్మకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించిన ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆటోలో ఉన్న మరో ముగ్గురు మహిళలకు గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. ఆమె కొడుకు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# గ్రామీణ క్రీడాకారులకు వరం



పోతులమడుగులో నిర్మాణమైన మినీ స్టేడియం

- అందుబాటులోకి మరో స్టేడియం
- పోతులమడుగులో అధునాతన వసతులతో మినీ స్టేడియం
- రూ.2.65 కోట్లతో నిర్మాణం

**మహబూబ్‌నగర్ క్రీడలు:** పాలమూరు జిల్లా క్రీడలకు కేరాఫ్‌గా మారుతోంది. ఇప్పటికే జిల్లాలో పలు నూతన స్టేడియంలు నిర్మాణమయ్యాయి. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో అన్ని వసతులతో కూడిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఎంవీఎస్ కళాశాల ప్రాంగణంలో మినీ స్టేడియం, చిన్నచింతకుంట మండలం అల్లీపూర్‌లో మినీ స్టేడియం నిర్మాణమై క్రీడాకారులకు అందుబాటులోకి వచ్చాయి.

### పోతులమడుగులో మినీ స్టేడియం

జిల్లాలోని భూత్పూర్ మండలం పోతులమడుగులో అధునాతనమైన మినీ స్టేడియం నిర్మాణమైంది. గ్రామీణ క్రీడాకారులకు ఈ మినీ స్టేడియం ఒక వరంలా మారనుంది. ఎంతో సువిశాలమైన వాతావరణంలో మినీ స్టేడియం నిర్మాణం చేశారు. రూ.2కోట్ల 65లక్షల నిధులతో ఈ మినీ స్టేడియం పనులు చేపట్టారు. మినీ స్టేడియాన్ని ఈనెల 14న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు.



మినీ స్టేడియాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి (ఫైల్)

**ఔత్సాహిక క్రీడాకారులకు మేలు**



పోతులమడుగులో నిర్మాణమైన మినీ స్టేడియంతో ఔత్సాహిక గ్రామీణ క్రీడాకారులకు ఎంతో మేలు జరగనుంది. క్రీడాకారులకు ప్రాక్టీస్ చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. క్రీడాకారులకు మెరుగైన క్రీడా శిక్షణ లభిస్తుంది.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

### మినీ స్టేడియంలో క్రీడావసతులు

మినీ స్టేడియంలో కార్యాలయం బిల్డింగ్, షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ హాల్, టేబుల్ టెన్నిస్ హాల్, స్టోర్ రూంలు ఏర్పాటు చేశారు. మినీ స్టేడియం ఆవరణలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. త్వరలో స్టేడియం ఆవరణలో 200మీటర్ల అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటు కానుంది. కేవలం పట్టణాలకే పరిమితమైన మినీ స్టేడియం ఇప్పుడు గ్రామీణ క్రీడాకారులు అందుబాటులోకి వస్తున్నాయి. భవిష్యత్‌లో గ్రామీణ క్రీడాకారులకు ఈ మినీ స్టేడియం క్రీడా శిక్షణకు కేరాఫ్‌గా మారనుంది. పోతులమడుగులో మినీ స్టేడియం అందుబాటులోకి రావడంతో నియోజకవర్గంలోని సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రైతు సంక్షేమమే ధ్యేయం



జూరాల ఎడమ కాల్వ వద్ద రైతులతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి
- జూరాల ఎడమ కాల్వ ద్వారా నీటి విడుదల

**అమరచింత:** రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం ప్రియదర్శిని జూరాల ప్రధాన ఎడమ కాల్వ ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమం పేరిట వారి నెత్తిన కుచ్చుటోపీ పెట్టిందని ఆరోపించారు. రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసింది గత ప్రభుత్వమేనని అన్నారు. మక్తల్ నియోజకవర్గంలోని సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల సామర్థ్యంను పెంపచడమే కాకుండా ప్రతీ ఎకరానికి సాగునీటిని అందించేందుకు లిఫ్టులను ఏర్పాటు చేస్తున్నామని ఆయన ప్రకటించారు.

### వసతుల కల్పనకు కృషి

జూరాల ప్రాజెక్టుపై వసతుల కల్పనకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రాజెక్టుపై రహదారి, రాత్రివేళ విద్యుత్ బల్బులు వెలిగేలా చర్యలు తీసుకుంటామని, ఇందుకు నివేదికలు సిద్ధం చేయాలని డీఈ నారాయణను ఎమ్మెల్యే ఆదేశించారు. మక్తల్ నియోజకవర్గంలో రహదారుల కోసం ఏడాదిలోనే రూ.15 కోట్లను మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం, నాగరాజ్‌గౌడ్, ప్రాజెక్టు డీఈ నారాయణ, ఏఈ ఆంజనేయులు, నాయకులు అయూబ్‌ఖాన్, చుక్క ఆశిరెడ్డి, మహేందర్ రెడ్డి, సర్వారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# విద్యార్థుల మధ్య ఘర్షణ

**మహబూబ్‌నగర్ క్రైం:** విద్యార్థుల మధ్యలో జరిగిన చిన్నపాటి ఘర్షణ చివరకు కొట్టుకునే వరకు వెళ్లింది. ఓ విద్యాసంస్థ నిర్వాహకులు ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని బ్రాంచ్‌లకు కలిపి జోనల్ స్పోర్ట్స్ ఈవెంట్‌ను సోమవారం స్టేడియం మైదానంలో నిర్వహించారు. అయితే విజేత టీంలకు ట్రోఫీలు అందించే క్రమంలో విన్నర్ జట్లు సంబరాలు చేసుకునే క్రమంలో ఇరుజట్ల విద్యార్థుల మధ్య మాటమాట పెరిగింది. ఈక్రీడల్లో బయటి వారిని తీసుకువచ్చి ఆడించారని ఓడినజట్టు ఆరోపించగా ఈవిషయంలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఘటన స్థలానికి టూటౌన్ పోలీసులు వెళ్లి అదుపు చేశారు. ఈవిషయంపై టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్‌ను వివరణ కోరగా ఎలాంటి కేసు నమోదు చేయలేదని తెలిపారు.

# హోరాహోరీగా జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు

- రెండో రోజు 16మ్యాచ్‌లు

**కోస్గి:** ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కోస్గిలో జరుగుతున్న జాతీయస్థాయి అండర్-19 వాలీబాల్ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఈ పోటీల్లో రెండోరోజు సోమవారం 16మ్యాచ్‌లు జరగగా 32 జట్లు పాల్గొన్నాయి.



పోటీ పడుతున్న బాలుర జట్లు



తలపడుతున్న జట్లు

**నిరాశపరిచిన తెలుగు రాష్ట్రాలు**

వాలీబాల్ పోటీల్లో తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జట్లు గట్టి పోటీని ఇచ్చినప్పటికీ ఓటమి చెంది నిరాశపరిచాయి. తెలంగాణ జట్టు మహారాష్ట్ర జట్టుతో ఓడిపోగా, ఆంధ్రప్రదేశ్ జట్టు హిమాచల్‌ప్రదేశ్ చేతిలో ఓటమి చవిచూసింది.గుజరాత్ జట్టు ఒడిస్సాపై 25-21, 25-10 స్కోర్‌తో గెలుపొందింది. ఉత్తరప్రదేశ్ జట్టు పంజాబ్ జట్టుపై 25-21, 25-18 స్కోర్‌తో, తమిళనాడు జట్టు ఉత్తరాఖండ్ జట్టుపై 25-18, 17-25, 15-13 స్కోర్‌తో, కర్ణాటక జట్టు బిహార్ జట్టుపై 25-14, 25-16 స్కోర్‌తో, హిమాచల్‌ప్రదేశ్ జట్టు ఆంధ్రప్రదేశ్ జట్టుపై 25-22, 25-20 స్కోర్‌తో, పుదుచ్చేరి జట్టు దాద్రనగర్ హవేలి జట్టుపై 25-20, 25-16 స్కోర్‌తో, పశ్చిమ బెంగాల్ జట్టు సీఐఎస్‌సీఈ జట్టుపై 25-20, 25-20 స్కోర్‌తో, కేరళ జట్టు మధ్యప్రదేశ్ జట్టుపై 25-20, 25-18 స్కోర్‌తో, ఢిల్లీ సీబీఎస్ఈ వెల్ఫేర్ జట్టు ఎన్‌వీఎస్ జట్టుపై 25-19, 25-19 స్కోర్‌తో, జమ్ముకాశ్మీర్ జట్టు చండీఘర్ జట్టుపై 25-22, 25-17 స్కోర్‌తో, ఢిల్లీ జట్టు విద్యాభారతీ జట్టుపై 25-19, 25-18 స్కోర్‌తో, మహరాష్ట్ర జట్టు తెలంగాణ జట్టుపై 25-21, 25-18 స్కోర్‌తో, హరియాణ జట్టు జార్ఖండ్ జట్టుపై 25-15, 25-20 స్కోర్‌తో, ఐపీఎస్‌సీ జట్టు లక్షదీప్ జట్టుపై 25-19, 25-18 స్కోర్‌తో, రాజస్థాన్ జట్టు చత్తీస్‌ఘడ్ జట్టుపై 25-13, 25-21 స్కోర్‌తో, సీబీఎస్ఈ జట్టు ఐబీఎస్ఓ జట్టుపై 25-13, 25-04 స్కోర్‌తో విజయం సాధించాయి.

# జాతీయ జెండాలకు అవమానం

**అచ్చంపేట రూరల్:** జాతీయ జెండాలను అవమానించారు. బల్మూర్ మండలం పోలిశెట్టిపల్లి శివారులోని ఓ వెంచర్‌లో జాతీయ జెండాలను పడేసిన దృశ్యం సోమవారం కనిపించింది. సమైక్యత వజ్రోత్సవాల నేపథ్యంలో మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఇంటింటికీ జెండాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. జాతీయ జెండాలను ఇళ్లపై ఎగురవేసి వాటికి అవమానం కలగకుండా జాగ్రత్తగా భద్రపరచాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఆబాధ్యతను మున్సిపల్ కమిషనర్లు, గ్రామ పంచాయతీ సెక్రటరీలు చూసుకోవాల్సి ఉంది. ఈనేపథ్యంలో జాతీయ జెండాలు బహిరంగ ప్రదేశంలో దర్శనమివ్వడం పలువురిని కలచివేసింది. జాతీయ జెండాను అవమానపరుస్తూ పడేయడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



పోలిశెట్టి శివారులో వెంచర్‌లో పడేసిన జాతీయ జెండాలు